


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటివరకూ జరిగిన కథ

ఎపిసోడ్ :1 (జనవరి)

శృంగి, మట్టు అడవిలో నడుస్తూ ఓ శిథిలాలయానికి చేరుకుంటారు శృంగి బ్రాహ్మణుడు. మట్టు భిల్లుడు. ఆ ఆలయంలో 18 చేతులు గల నిలువెత్తు అమ్మవారు. తిరిగి వచ్చేప్పుడు ఓ భయంకరమైన పాము తోక మీద నిలబడి వారిని అడ్డగిస్తుంది. శృంగి స్పృహ తప్పుతాడు.

❀❀❀

ఎపిసోడ్: 2 (ఫిబ్రవరి)

రాబీ వెబ్‌స్టర్ అనే అమెరికన్ ని జయదేవ్ ఏర్‌పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాడు. ఆ రాత్రి రాబీ(రాబర్ట్)కి విలియమ్స్ అనే ఆత్మ కనిపిస్తుంది. జయదేవ్ రాబీని తిరుపతి పంపుతూ డ్రైవర్ని చూస్తాడు. ఆ డ్రైవర్ అచ్చు రాబీ వర్ణించిన విలియమ్స్ పోలికతో వుండడం జయ్‌ని విస్మయానికి గురిచేస్తుంది.

❀❀❀

ఎపిసోడ్: 3 (మార్చ్)

శృంగి, మట్టూ రామజోగినీ, మధురనీ కలుస్తారు. పాము విషయం మట్టు రామజోగికి వివరిస్తాడు.

జర్నీలో రాబర్ట్ విలియమ్స్‌లా వున్న డ్రైవర్‌తో సంభాషిస్తాడు. శ్రీనివాస్ రాబీని రిసీవ్ చేసుకుంటాడు. రాబీ హోటల్ గదిలో కళ్ళు తిరిగి పడిపోతాడు.

❀❀❀

ఎపిసోడ్ 4: (ఏప్రెల్) తక్షపురం గురించి రామజోగికి వర్ణిస్తాడు మట్టూ. రాబీకి స్పృహ వస్తుంది. శ్రీనివాస్‌తో గోవిందరాజస్వామి ఆలయంలోకి అడుగుపెట్టి చిత్రంగా ఆ గుడంతా పరిచయం ఉన్నట్టు నడుస్తూ తెలుగు మాట్లాడతాడు. స్వామిని చూచి గట్టిగా అరిచి స్పృహ తప్పుతాడు రాబీ. షోలింగర్‌లో జయదేవ్, సుదర్శన్ భట్టాచార్య రాబీ గురించి డిస్కస్ చేస్తారు. రామజోగి మధురని సముదాయిస్తాడు. రాబీ స్పృహలోకి వచ్చి శ్రీనివాస్‌తో విలియమ్స్ గురించి చెబుతాడు.

❀❀❀

*ఎపిసోడ్:5 (మే) జయ్ శ్రీనివాస్ రాబీ గురించి శాస్త్రిగారితో డిస్కస్ చేస్తారు.*

*ఎపిసోడ్:6 (జూన్) అందరూ, అంటే జయ్, రాబీ, శ్రీనివాస్, శాస్త్రిగారూ, సుదర్శన్ రెండు కార్లలో పలమనేరు వైపుకి బయల్దేరతారు. శ్రీనివాస్ సామాన్లతో రెండో కారులో ఉంటాడు. వారణాసి, మోహన్ గిరి, కిషన్ బైరాగి గంగాతీరాన పరిచయం అవుతారు. కిషన్ హిందూ మతం వదిలి ఫకీర్‌కి శిష్యుడవుతాడు. ఫకీర్ కిషన్‌కి 'బిదాసీ' అనే శక్తిని చూపుతాడు.*

*ఎపిసోడ్ 7: (జూలై)*

*తక్షపురానికి ఓ ముసలిది వస్తుంది. ఆమెకీ సర్పశిలకీ సంబంధం ఏదో ఉందని జనాలు రకరకాలుగా ఊహిస్తుంటారు. ఆలయ పూజారి, ప్రవచకుడూ, ప్రెసిడెంటూ డబ్బులు దండుకునే ఆలోచనలు చేస్తూంటారు. జయ్, శాస్త్రిగారు, రాబీ, సుదర్శన్‌లు వెడుతున్న కారు రోడ్డు పక్కకి పడిపోతుంది.*

*ఎపిసోడ్ 8 (ఆగస్టు) పెద్ద పుల్లేటి కుర్రు ఆశ్రమంలో కన్యాదేవి, మాయాదేవి మరో పదహారుమంది ఉంటారు. వారిని అక్కడికి పంపింది నిశ్చలానంద (వారణాసి) అవధానీ, హనుమంతు ఆశ్రమం గురించి మాట్లాడుకుంటారు. విలియమ్స్ తూఫానులోనించే శ్రీనివాస్‌తో ఆహారం జలం మొదటి కారు వాళ్ళకి పంపుతాడు.*

*మట్టూతో బాటు శృంగిని కూడా శిథిలాలయానికి వెళ్ళమని ఆదేశిస్తాడు రామజోగి.*

*ఎపిసోడ్ 9 (సెప్టెంబర్)*

*ప్రకృతి ప్రేమికులు, రక్షకులు దేవతలు.*

*ప్రకృతి నాశకులు రాక్షసులు*

*ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. మదాలస హార్స్‌లీ హిల్స్ గురించి సుదర్శన్‌కి వివరిస్తుంది. యజ్ఞనారాయణగారు శాస్త్రిగారు జరుగుతున్న సంఘటనల గురించి చర్చిస్తారు.*

*ఎపిసోడ్ –10*

*అవధాని హనుమంతుని హెచ్చరిస్తాడు.అవధాని పాములు లలలోకి రావడం గురించి సూరయ్యగారికి చెబుతాడు .తక్షపురంలో ముసలిది శాపాలు పెడుతూ వికటాట్ట హాసం చేస్తుంది.*

*తరువాయి భాగం చదవండి ...*

"**అలంబసా**.. ప్రతిజీవి పుట్టుకకీ ఓ అర్ధం, విశేషార్ధం, అంతరార్ధం గూడార్ధం ఉన్నాయి. ప్రతి వ్యక్తికీ తన గత జన్మలో గుణంలోగానీ, గుప్తంగా గానీ స్ఫురిస్తూనే ఉంటాయి. ఒకడ్ని చూసి 'వీడు ఎద్దులాంటివాడనో, జిత్తులమారి నక్కలాంటివాడనో, సింహంలాంటి ధైర్యం గలవాడనో అంటాం. దానికి అర్ధం ఏమంటే మనిషిగా పుట్టడానికి ముందువాడు ఆయా జంతువుల లక్షణాల్ని 'గుణం'గా పుణికి పుచ్చుకుని పుట్టాడన్నమాట. అలాగే కొందరు పుట్టుకతోనే ఆస్తికులుగా పుట్టి తరవాత నాస్తికులుగా మారుతారు. కొందరు పరమనాస్తికులుగా పుట్టి మహా ఆస్తికులుగా మారి జనాల్ని అవాక్కు చేస్తారు. కొందరు మహా ధనవంతులుగా పుట్టి తరవాత సర్వం కోల్పోయి దరిద్రులుగా దేహం చాలిస్తే, ఒకరు పరమ పేదలుగా పుట్టి తరువాత తరువాత కోట్లకు పడగలెత్తుతారు. దాన్ని 'ప్రాప్తం' అని మనం ఒక్కమాటతో తెచ్చేస్తాం. ఆ ప్రాప్తా, ప్రాప్తాలకు కారణం ఏమిటీ? ఆ విషయాన్ని మాత్రం యోచించం. నీకు నీ పూర్వజన్మ గుర్తుంది. అదీ ఎప్పటిదీ? మహా భారతకాలం నాటిది. అప్పటినించి ఇప్పటివరకూ అంటే, మహాభారత కాలాన కురుక్షేత్రంలో నీవు ఘటోత్కచుని చేతిలో మరణించినప్పటినించీ యీ రెండువేల ఇరవై శతాబ్దం వరకూ ఎక్కడున్నావూ? ఏ రూపంలో వున్నావు? చెప్పగలవా? చెప్పలేవు. ఎందుకంటే నీకు గుర్తున్నది ఆ యుగమూ ఆ సమయమూ. మళ్ళీ ఇప్పటి జన్మమూ, దీనికి సంబంధంచిన నీ తల్లిదండ్రులూ. మధ్యలో ఏమయింది. ఇన్ని వేల సంవత్సరాలు ఏ రూపమూ లేకుండానే గడిపావా? గడిపితే ఆత్మగానా, ప్రేతాత్మగానా? ఆగాడు అరిదమనుడు.

"అరిదమనా, ఇది నీకే కాదు.. నాకూ ఓ చిక్కు ప్రశ్నే. యీ లోకంలో ఏ జీవికీ తెలీదు. తనెందుకు పుట్టిందో. మనిషి బుద్ధిజీవి అంటాంగదా. ఆ మనిషి కూడా తన పుట్టుక వ్యవహారాన్ని పక్కన పెట్టి, ప్రకృతి రహస్యాలు కనుక్కోవడానికే తన సమయాన్నీ శక్తినీ వినియోగిస్తున్నాడు. పోనీ, దానివల్ల ఫలమేమైనా ఉందా? ఉందంటే ఉంది. సౌకర్యవంతంగా జీవించడం అనే లాభం ఉంది. అంతకు మించినదేదీలేదు. అయినా మనిషి ఆ విషయాన్ని పక్కనపెట్టడు. నడిచేవాడు సైకిలు కనిపెట్టాడు. బండి కనిపెట్టాడు. మరింత వేగాన్ని పుంజుకునే మోటార్ సైకిలూ, రైలూ విమానం రాకెట్టూ శాటిలైటూ కనిపెట్టాడు. అన్నిటికీ మూలం 'వేగాన్ని' పెంచుకోవడమే, కానీ, తన జన్మ గురించీ, గత, రాబోయే జన్మల గురించి ఒక్క క్షణంకూడా యోచించడంలేదు. అరిదమనా, నీ ప్రశ్నలు ఇంతకుముందు నేనూ వేసుకున్నాను. ఒక్కటిమాత్రం లీలగా గుర్తొస్తున్నది. ఈ భూమి లోపలి పొరల్లో నేనో (క్షేచరాన్నై) క్షేచరంలా వేలాది సంవత్సరాలు పడివున్నానని. నా చుట్టూ కూడా నాలాంటి క్షేచరాలే.

(క్షేచరం అంటే భూమి లోపలి పొరల్లో జీవించే జీవులు) కొన్ని చిన్నవైతే, కొన్ని పర్వతాల్లాంటివి. ఒక ఓంకారం మాత్రం నిరంతరం వినిపిస్తూ ఉండేది. ఆ ఓంకారమే యీ భూమిని చీల్చి నన్ను పైకి లాక్కొస్తుందనే ఓ నమ్మకం నాలో ఉండేది. ఆ సమయంలో నేను మానవుడ్ని కాదు. కానీ ఆలోచనలు ఉండేవని మాత్రం చెప్పగలను. ఓ మహా తాబేలులాంటి

ఆకారాలవి." మౌనంలోకి జారిపోయాడు అలంబసుడు. అరిదమనుడు సుదీర్ఘంగా నిట్టూర్చాడు. మానవ మేధస్సుకి అందని ప్రకృతి రహస్యాలు కోకొల్లలు. భూమిలోపలి పొరల్లో లక్షలాది రకరకాల జీవులు ఉన్న సంగతి తెలుసు. రాళ్ళల్లో 'కప్ప'లాగా అవి భూమిలోపలి పొరల్లోనే జీవిస్తాయి. ఏ కిరణమూ వాటిని తాకలేదు. ఆ తమస్సులోనూ ఒక వెలుగు ఉంది. ఆ వెలుగు మానవనేత్రాలకు అందదు. మరో గాఢమైన నిట్టూర్పు అరిదమనుని నాశికనుంచి వెలువడింది. "జీవితమూ ఊహ కూడా ఒక్కొక్కప్పుడు ఒకటే అనిపిస్తాయి. సముద్రంలో ఉండే జీవులు సముద్రంలోనే బ్రతుకుతాయి. వాటిశ్వాసా, ఆహారమూ, ఆశా, సంతానోత్పత్తీ ఆకరికి మృత్యువు కూడా అపార జలరాశిలోనే. అలానే నేనూ ఓ క్షీరదంగా కొన్నివేల సంవత్సరాలు బ్రతికి ఉండొచ్చు. భూమిపైన కాలంవేరు, భూమిలోపల బ్రతికి ఉండొచ్చు. భూమిపైన కాలంవేరు, భూమి లోపల కాలం వేరు ఈ కాలం నిర్ణయింపబడేది సూర్యోదయ సూర్యాస్తమయాల ద్వారా. మరి అనంతమైన చీకటి అలముకున్న భూమి లోపలి పొరల్లో కాలగమనం ఎలా నిర్ణయింపబడుతుందీ? ఏమో ఆ రూపం ధరిస్తేగానీ ఆ సమయాన్ని గురించి తెలీదు. ఓ అరిదమనా, ఒక్కటి నిజం. మహాభారత సమయంలో మరణించాక నాకు గుర్తువున్నది ఆ అనుభవాలే. ఓయీ, యుగాలు మళ్ళీ మళ్ళీ రుతువుల్లాగానే వస్తాయి. అయితే, మళ్ళీ మళ్ళీ అవే సంఘటనలు జరుగుతాయా? అలా అయితే నేను నిద్రలేవాల్సింది మళ్ళీ ద్వాపర యుగంలో. మరి యీ కలియుగంలో ఎందుకు పుట్టానూ?" మళ్ళీ మౌనంలోకి జారిపోయాడు అలంబసుడు. అరిదమనుడు మాట్లాడలేదు. దూరం నించి సంకల్పానంద రావడం ఇద్దరూ చూశారు. "ఈ సంకల్పానంద ప్రజ్ఞ అపూర్వం అద్భుతం. అన్నింటిలోనూ శుభాన్నే చూచే అతని దృష్టికి నమోవాకాలు తెలుపవలసినదే. నీ అనుభవమూ, నా ప్రశ్నలూ కూడా ఇతని ముందు పెడితే సమాధానాలు లభించవచ్చు. కానీ అది తగదు." నిట్టూర్చి అన్నాడు అరిదమనుడు.

"అయ్యా నివృత్తి యుగాన్ని ఇప్పటికే రెండు మాసాలపాటు చెయ్యకుండా వూరుకున్నాం. ఈ మాసం కదిలి వెళ్ళిపోయేలోగా చేసి తీరాలి" ముక్కు సూటిగా ఇద్దరితోనూ చెప్పాడు సంకల్పానంద.

"అవును. చేసి తీరాలి. అనీషుడు రేపటిలోగా వస్తాడు. మట్టు కూడా రావాలి. శృంగిని వెంట తెస్తాడో లేదో. కానీ, శృంగి మనతో వుండటం మంచిదేననిపిస్తోంది. ఇక్కడున్న నీలునికి ఏఏ పదార్థాలు కావాలో చెబితే అతడు బిల్లు యువకుల్ని సమీకరించి పదార్థాలను సమకూర్చగలడు" అన్నాడు అలంబసుడు.

"అలాగే నీలుడికి చెబుతాను" మెల్లగా కదిలి వెడుతూ అన్నాడు సంకల్పానంద. విశ్వశాంతి యజ్ఞాన్ని నిర్వర్తించిన వెంటనే చేయాల్సిన నివృత్తి యాగం ఇప్పటివరకు జరగలేదు. కారణం అక్కడ పుష్కలంగా లభించే 'పాణికి' పుల్లలు లభించలేదు. అనేకానేక మూలికలు సమిధలు కూడా సమకూరలేదు. కారణం భయానకంగా పడిన పిడుగులు, దారుణంగా కురిసిన వాన. ఛిన్నాభిన్నమైన అడవి. ఓ మహా ప్రళయం తరువాత వచ్చే నిశ్శబ్దంగా, అడవి తన గాయాలకు మందు పూసుకుంటోంది. విరిగి నేలకొరిగిన చెట్లు మళ్ళీ చివుర్చి బలం పుంజుకునే ప్రయత్నం చేస్తున్నాయి. లక్షలాది

పక్షులు కూలిన గూళ్ళతోనే కొత్త గూళ్ళు నిర్మించే పనిలో పడ్డాయి. జలంతో నిండిపోయిన లోయలలోని తటాకాల్లోకి ఎలా వచ్చాయో, చేపలు విపరీతంగా సంతతిని పెంచుకుంటున్నాయి. కొంగలకి ఎలా తెలిసిందో మరి, చేపలు సమృద్ధిగా వున్నాయి గనక వేల సంఖ్యలో అవి రంగు రంగుల రెక్కల్ని అల్లల్లార్చుతూ ఆ తటాకాలు దగ్గరిలోని వృక్షాల మీద కాపురాలు మొదలెట్టాయి. కొన్ని కొత్త రకం పక్షులు వచ్చి అడవిని వాటి అరుపులతో నింపేస్తున్నాయి. అడవి మెల్లగా పచ్చని కొత్త కోక చుట్టుకుంటోంది.

"శరద్వతీ.. ఇక్కడ వాతావరణం అద్భుతం అయినా, ఈ చలిని భరించడం నావల్ల కావడంలేదు. మాదీ తిరుపతి కొండలే. కానీ అక్కడి చలి 'ఇలా' వుండదు" కౌంటర్ దగ్గరికి ఓ కుర్చీ లాగి కూర్చుంటూ అన్నాడు శ్రీనివాసు.

చిన్నగా నవ్వింది శరద్వతి. ఆ నవ్వు ఓ అద్భుతం.

"ఎందుకు నవ్వుతున్నారూ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మిస్టర్ శ్రీనివాస్. మీరు ఏదో మాట్లాడాలని వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారు. అందుకే నాకు నవ్వొచ్చింది" మరోసారి నవ్వింది శరద్వతి.

"అఫ్‌కోర్స్... ఆ మాట నిజమే" సిన్సియర్‌గా అన్నాడు శ్రీనివాస్.

"అయితే విషయం ఏమిటో చెప్పండి" పని ఆపి అడిగింది శరద్వతి.

15రోజుల క్రితం తనకీ విలియమ్స్ కీ జరిగిన సంభాషణ గుర్తుకొచ్చింది. అన్నట్టుగానే విలియమ్స్ రెండు రోజుల తరువాత మళ్ళీ తిరుమల బాడీలో ప్రవేశించాడు.

"ఐ యాం బాక్... " విలియమ్స్అన్నాడు.

"ఇక్కడ ఎందుకుండాలి? ఎన్నాళ్ళు వుండాలి? నిజంగా నాకు పిచ్చెక్కుతోంది విలియమ్స్. మంచుకొండల్లో నగ్నంగా ఉన్నట్టుంది నా పరిస్థితి" కోపంగా అన్నాడు శ్రీనివాస్.

"మిస్టర్ శ్రీనివాస్ రేపొద్దున నేను వెళ్ళిపోతా. తిరుమల నాతోనే రావాలి. అంటే అతని బాడీని అతనికే వదిలి, ఆత్మగా నేను వెళ్ళిపోతా. నువ్వు ఎన్నాళ్ళుండాలో నీ చేతుల్లోనే ఉంది. శ్రీనివాస్, యీ శరద్వతికీ నీకూ వివాహం జరగాలి. ఆమె ఉత్తరదేశపు అనాధ. అయినా నువ్వు పెళ్ళాడాలి" అన్నాడు విలియంస్.

"నేనా? ఎందుకు పెళ్ళాడాలీ? నేను శ్రోత్రీయ బాహ్మడ్ని. ఆంధ్రుడిని. ఆమె పూర్వోత్తరాలు ఎవరికీ తెలీయవు" అరిచాడు శ్రీనివాస్.

"అలాగా! నీవసలు బ్రాహ్మడివని ఎవరు చెప్పారు? శరద్వతిలానే నువ్వూ అనాధవే. నీ తల్లిదండ్రులు అని నువ్వు అనుకునే వాళ్ళు నిన్ను పెంచారు. అంతే. నువ్వు ఆంధ్రుడవూ కావు. నిన్నుగన్న తల్లి ఓ మహారాష్ట్రియన్. నీ తండ్రి ఆంధ్రా

బ్రాహ్మణుడు. ఇప్పటి తల్లిదండ్రులకి నీవు ట్రైన్‌లో దొరికావు. ఓయీ, నీకూ శరద్వతికీ గల సంబంధం ఇప్పటిది కాదు. మీ వివాహం వల్ల ఒనగూడే ఒక గొప్ప ఫలం ఉంది. అందుకే నిన్ను మీవాళ్ళందరి దగ్గర్నించీ దూరంగా లాక్కొచ్చాను. ఈ శరద్వతికి పుట్టబోయే బిడ్డ ఓ మహా శక్తిశాలి అవుతాడు. వానివల్ల యీ లోకానికి చాలా ఉపకారం జరుగుతుంది. అనూపవతి భర్త నీకు రేపు కావల్సినంత డబ్బు పంపుతాడు. ఆ ఏర్పాటు నేను చేశాను. శరద్వతిని వివాహం చేసుకుని ఆమెతోపాటు నువ్వు తిరుపతి వెళ్ళు. శ్రీనివాసా, ఏమీ సందేహించకు. శరద్వతి వంటి పిల్ల మళ్ళీ పుట్టదు" అనునయంగానూ, అధికారం కూడా ధ్వనించే స్వరంతోనూ అన్నాడు విలియమ్స్.

ఆ తరువాత గంటకి గానీ స్పృహ రాలేదు.

"చెప్పండి శ్రీనివాస్" అన్నది శరద్వతి. ఆమె కళ్ళు నవ్వుతున్నాయి.

"శరద్వతీ.. గత పదిహేను రోజుల్నుంచీ నాలో నేనే సంఘర్షించుకుంటున్నా. లెక్కలేనన్ని ఆలోచనలు. ఇక భరించడం నావల్ల కాదు. మీరు నన్ను పెళ్ళిచేసుకుంటారా? పెళ్ళి చేసుకోవడానికి సమ్మతిస్తారా?" తెగించి అడిగాడు శ్రీనివాస్.

"అసలా ఆలోచన ఎందుకొచ్చిందీ?" అడిగింది శరద్వతి.

"నిజం చెప్పాలంటే ఆ ఆలోచన నాలో పుట్టలేదు. నాదో క్రింది మధ్య తరగతి కుటుంబం. పెళ్ళి అనేదాని గురించి నేను అసలు ఆలోచించనేలేదు. ఆ ఆలోచన కలిగించింది విలియమ్స్"అన్నాడు శ్రీనివాస్.

"విలియమ్స్ ఎప్పుడు వచ్చారు?" ఆశ్చర్యంగా అడిగింది శరద్వతి.

"రాలేదు. రాలేదు కూడా. విలియమ్స్ సజీవుడైన మనిషికాదు. సజీవమైన ఓ ఆత్మ" అంటూ విలియమ్స్ కథ అంతా చెప్పాడు శ్రీనివాస్. రాబీ వెబ్‌స్టర్, జయ్, పరమేశ్వర శాస్త్రి, భట్టాచార్య అందరి గురించీ వివరంగా చెప్పి ఎలా తిరుమల బాడీలో విలియమ్స్ ప్రవేశించాడో కూడా వివరించాడు.

"ఓ గాడ్.. అన్‌బిలీవబుల్. మనిషిగా పుట్టిన వాడెవడూ యీ అభూత కల్పనని నమ్మడు కానీ నమ్మక తప్పదు. ఎందుకంటే, అనూపవతి భర్త మీకిమ్మని ఇరవైరెండు లక్షల రూపాయలు పంపడమే. అది మీరు వెళ్ళిపోయేటప్పుడు మాత్రమే ఇవ్వాలని స్ట్రిక్టుగా ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చారు" షాక్‌తో అన్నది శరద్వతి.

"విలియమ్స్ మాట ప్రకారం నేను ఇక్కడినించి కదలాలంటే మిమ్మల్ని వివాహం చేసుకునే కదలాలి" మెల్లగా అన్నాడు శ్రీనివాస్.

"నేను చేసుకోనంటే?"

"నిజంగా వెళ్ళిపోతాను. ఒక్క పైసా కూడా ముట్టను. శరద్వతీ, విలియమ్స్ నాతో చెప్పేవరకూ నేనూ ఓ అనాధననే విషయం నాకు తెలీదు. మా అమ్మగార్ని, ఫోన్ దగ్గరికి రప్పించి అడిగితేగానీ, నిజం తెలియలేదు. విలియమ్స్ ఎవరైనాగానీ,

అతనికి నా గతం తెలుసన్నది వాస్తవం. పాతికేళ్ళుగా నాకే తెలియని నా జన్మ రహస్యం అతనికెలా తెలిసింది? ఓ ఆత్మ గతాన్నీ, భవిష్యత్తునీ చూడగలదా? చూడగలదని రుజువైంది కదా? అందుకే నిర్ణయం నీకే వదిలేస్తున్నాను. పెళ్ళి అవ్వాలంటే ఎన్నో కొన్ని జన్మల బంధం ఉండాలంటారు విజ్ఞులు. అంటే మనిద్దరికీ అటువంటి బంధం ఉంటే పెళ్ళవుతుంది. లేదా – లేదు" స్పష్టంగా అన్నాడు శ్రీనివాస్. అతని గుండెమీద పెట్టిన ఆలోచనల కొండ క్షణంలో కరిగిపోయింది.

"నిజం శరద్వతీ... యీ పదిహేను రోజుల్లో నేను పడ్డ క్షోభ సామాన్యమైనది కాదు. లోకం దృష్టిలో నేను బ్రాహ్మణుడిని. ఫలానా వారు నా తల్లిదండ్రులు. నిజంగా చెబితే కనీసం తల్లిదండ్రుల రూపు రేఖలు కూడా తెలీని అనాథని" సైలెంటయ్యాడు శ్రీనివాస్.

శ్రీనివాస్ భుజం మీద అనునయంగా నిమిరి, తన గదిలోకి నిష్క్రమించింది శరద్వతి. ఒక్కమాట లేదు ఆ రాత్రంతా గుళ్ళో విరూపాక్షుడితోబాటు శరద్వతీ, శ్రీనివాసులు కూడా ఆ చలిరాత్రికి సాక్షులుగా ఉన్నారు.

"తిరుపతి వెళ్ళాలి" అన్నాడు రాబీ వెబ్‌స్టర్.

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అన్నారు శాస్త్రిగారు.

"రాత్రి స్పష్టంగా ఒక 'విజన్'ని చూశాను. తిరుపతి దగ్గరలోని 'గుడిమల్లం' అనే ఊరు వుంది. ఆ గుడి ప్రపంచంలోనే మొదటి శివాలయం అని పేరుపొందింది. అక్కడ పూజలు నిర్వర్తించాలని నాకొచ్చిన స్వప్నం ఆదేశించింది. పూజలంటే ఎటువంటి పూజలో నాకు తెలీదు. కానీ, అక్కడికి వెడితే అవే తెలుస్తాయి" ఇంగ్లీషులో, అది, అమెరికన్ యాక్సెంట్‌తో అన్నా, తెలుగులో అన్నట్టే అనిపించింది అక్కడున్న జయ్, సుదర్శన్, యజ్ఞప్ప శాస్త్రివాళ్ళకి.

వెడతాం వెడతాం అంటూనే అందరూ పదిహేడు రోజులపాటు అక్కడే వున్నారు. శాస్త్రిగారికి జ్వరం వచ్చి ఓ పదిరోజులు పోస్ట్‌పోన్ అయితే, రాబీ పూర్తి మౌనంతో వుండటం ఓ కారణం అయింది. తట్టాబుట్టా సర్దుకున్న సుదర్శన్ కూడా ఎందుకో కదల్లేదు.

"గుడిమల్లం అన్న ఊరు ఉండటం నిజమే. అది దేశంలోనే అతి ప్రాచీనమైన శివాలయంగా పేరుపొందడమూ నిజమే. ఆ శివుని పేరు పరశురామేశ్వరుడు. ఆ దేవాలయం క్రీస్తుకి పూర్వం దాని ఆర్కియాలజీ నిపుణులు స్పష్టంగా రుజువు పరిచారు. అనేక శాసనాలు కూడా లభించాయి. సంతానేశ్వరుడనే మరోపేరుతో కూడా పరుశురామేశ్వరుడ్ని పిలుస్తారు. సంతానం లేనివారు గుడిమల్లంలో నిద్రచేస్తే, బిడ్డలు కలుగుతారని వమ్ముపోని నమ్మకం ప్రజల్లో ఉన్నది" వివరించారు శాస్త్రిగారు.

"అయితే తప్పక వెళ్ళి తీరాల్సిందే" ఉత్సాహంగా అన్నారు యజ్ఞప్ప.

"ఎంత విచిత్రం. తిరుపతినించి యీ రాబీని అతి ప్రయాసల కోర్చి ఇక్కడకు తెచ్చాం. రాబీకి వచ్చిన 'కలలు' సగం నిద్రావస్తలో అతను పెట్టిన కేకలు పలుకుల కంటే మరే అద్భుతమూ జరగలేదు. అసలు ఎందుకు వచ్చినట్టూ?" నిర్విణ్ణంగా అన్నాడు సుదర్శన్.

"నిజమే. సుదర్శన్‌గారూ మీరు గవ్వలు విసిరి భవిష్యత్తు చెబుతారు. విసరడం వరకే మీ వంతు. వెల్లకిలా పడాలో బోర్ల పడాలో గవ్వల వంతు. అలాగే విధి చేతిలోని గవ్వలం మనం. కాదంటారా?" నవ్వి అన్నది మదాలస.

"నూటికి నూరుపాళ్ళూ నువ్వు అన్నది నిజమే తల్లీ. జీవితం అంటేనే రాక – పోక. ఎక్కడికెందుకు వెళ్తామో, ఎక్కడికెందుకు వెళ్ళాలో ఏమీ తెలీదు. ఎక్కడో ఆంధ్రాలో ఓ మారుమూల గ్రామంలో పుట్టిన కూచిపూడి నృత్యం విశ్వవ్యాప్తమవలేదూ! అమెరికాలో ఎవరో ఎప్పుడో తయారుచేసిన కోకోకోలా ప్రతి వూళ్ళోనూ సాక్షాత్కరించలేదూ! అక్కడ పుట్టిన పిజ్జా ఇక్కడి చిరుతుండి అయింది. అదీ భూమే ఇదీ భూమే. అదీ ప్రకృతే ఇదీ ప్రకృతే. అయినా భేదాలు ఉన్నై. ఉంటై. ఎందుకు ఇక్కడికి వచ్చామో ఇన్నిరోజులు గడిపామో తెలీదుగానీ, యజ్ఞప్పగారి వంటి ఉత్తముడ్నీ, మనసునిండా ఆదరణా ఆప్యాయతా ప్రేమా నింపుకున్న నిన్నూ కలవడం మాత్రం నిజంగా అద్భుతమే. బహుశా మీ ఇద్దర్నీ మాకు కలపడం కోసమే యీ ప్రయాణాన్ని ఆ భగవంతుడు సృష్టించాడేమో" మదాలస తలని వాత్సల్యంతో నిమిరి అన్నారు శాస్త్రిగారు.

"ఆమాట నిజం" మనస్ఫూర్తిగా అన్నాడు సుదర్శన్.

"అయితే సామాన్లు సర్దండి. ఓ గంటలో బయల్దేరితే రాత్రిలోగా తిరుపతి చేరవచ్చు" లేచి అన్నాడు జయ్. అతనికి చాలా అనీజీగా వుంది. చెయ్యాల్సిన పనులు పెండింగ్‌లో పడటంవల్ల వచ్చిన అనీజీనెస్ అది.

"నేనెప్పుడో సిద్ధం. సర్దుకోవాల్సింది యజ్ఞప్పగారూ మదాలస" నవ్వి అన్నాడు సుదర్శన్.

అందరూ లేచారు. ఎక్కడ్నించో ఓ నెమలి వచ్చి యజ్ఞప్ప కుటీరం మీద వాలింది.

"శివపార్వతులంటేనే యీ సృష్టికి మూల పదార్థాలు. స్త్రీ పురుషశక్తులు. ప్రతి స్త్రీలోనూ ఒక మగాడుంటాడు ప్రతి పురుషుడిలోనూ ఓ స్త్రీ ఉంటుంది. ఎందుకంటే స్త్రీ పురుషులిద్దరూ జన్మించేది బీజమూ+అండమూ కలయిక వల్లనే. కనుక ఎవరు గొప్ప అనేది ముఖ్యంకాదు రెండూ సమానమే. ఆ రెండిటినీ లింగంగా, పానవట్టంగా మన పూర్వీకులు సింబాలిక్‌గా తీర్చిదిద్దారు. మానవులలోనే కాదు, సర్వజీవుల సృష్టికీ మూలం యీ స్త్రీ పురుషుల సంయోగమే." 'జటా వల్లభి' అనే బెంగాలీ యోగిని మాట్లాడుతోంది. మోకాళ్ళు దాటిన శిరోజాలు. గుండ్రని ముఖం. దసరా పండుగలో శిల్పులు తయారించేసే అమ్మవారి ముఖంలా సుందరంగా, అద్భుతమైన అనురాగం తొణికిసలాడుతున్నట్లుంది.

మాయాదేవి, మహాకన్యాదేవీ, ఇతర బ్రహ్మచారిణులూ శ్రద్ధగా వింటున్నారు. జటావల్లభి సంవత్సరానికోసారి ఉజ్జయిని వచ్చి పదిఉహేను రోజులు బసచేస్తుంది. ఆమెతోబాటు ఆమె శిష్యురాళ్ళూ వస్తారు. వారికి బస మొదలైనవి

ఏర్పాటు చేయడం కోసం కాళీమా ట్రస్ట్‌వారు ఓ వారం ముందే వస్తారు. రోజుకి ఓ గంట తప్ప మిగతా సమయమంతా జటావల్లభి యోగిని మౌనంగానే గడుపుతారు.

"అమ్మా కన్యా, నీదొక మహర్జాతకం. నువ్వు పుట్టింది ఒక శక్తివంతమైన కార్యం నిర్వహించడానికి. నిన్ను కలవడం చాలా ఆనందదాయకం" ఒక పంచలోహశ్రీ చక్రాన్ని మహా కన్యాదేవికి అనుగ్రహిస్తూ అన్నది జటావల్లభి.

"ధన్యోస్మి" అంటూ ఆ శ్రీ చక్రాన్ని అందుకున్నది కన్యాదేవి.

"బహిరంగంగా శరీరంలో ప్రాణ స్థానాలు 24 ఉన్నాయి. ఎడమ పక్క పన్నెండు, కుడిపక్క పన్నెండు. వాటికి అతీతమైన గుప్తస్థానాలు మూడున్నాయి. అందుకే యీ కొన్ని చక్రాలకి 27 ముక్కోణాలు. కొన్ని మహా చక్రానికి 39 మూలాలుంటాయి. కానీ అమ్మా, వాటిని పూజించే విధానం వేరు. చేయవలసిన సాధన వేరు" అభయ హస్తంతో దీవించి అన్నది జటావల్లభి.

"మామూలు శ్రీ చక్రంలా దీన్ని పూజించవచ్చా అమ్మా" సందేహ నివృత్తి కోసం అడిగింది మహామాయ.

"పూజలో కూర్చునేప్పుడు అర చేతుల మధ్యలో పెట్టుకుంటే చాలు. నీ శరీరమే యీ శ్రీ చక్రానికి నివాస స్థలంగా మారుతుంది. నీలోని శక్తిని గ్రహిస్తుంది. అనంతమైన శక్తిని తనలో ఇముడ్చుకుని అనవసరమైనప్పుడు ఆ శక్తిని తిరిగిస్తుంది" వివరించింది జటావల్లభి.

"చాలా అమ్మవార్ల గుళ్ళల్లో శ్రీ చక్రాలకి బదులు 'మేరువు' వుంటుందిగా?" అడిగింది ఓ శిష్యురాలు.

"రెండూ ఒకటే. మేరువుని ఎక్కడికి బడితే అక్కడికి తీసుకు వెళ్లలేము. అదీగాక మేరువుకి చెయ్యవలసిన పూజావిధానం వేరు. ప్రాణప్రతిష్ట జరిగాక పూజలన్నీ సక్రమంగా జరగాలి, మడి పాటించాలి. నైవేద్యాలు సక్రమంగా సమర్పించాలి. అంతేగాదు ఎక్కడ మేరువు ప్రతిష్టింపబడుతుందో అక్కడ అన్నదానం విధిగా చెయ్యాలి. అందుకే శ్రీ చక్రాన్ని మాత్రమే ఇచ్చాను. పూజా విధానం మహాకన్యకి తెలియనిది కాదు" నవ్వి అనంది జటావల్లభి

"అమ్మా యీ పూజలూ వ్రతాలు ఉపవాసాలు కేవలం ప్రజల్ని తప్పుదోవపట్టించేవనీ, మూఢత్వానికి రుజువులనీ కొందరు వాదిస్తున్నారు. వారికి ఏం సమాధానం చెప్పాలీ?" అడిగాడొక విద్యార్థి.

"సూర్యుడు లేకపోతే ఆహారం పండుతుందా? చంద్రుడు లేకపోతే అరటికాయలో గుజ్జు తయారవుతుందా? నీరు, గాలీ, అగ్నీ లేకపోతే అసలు సృష్టి అనేది ఉంటుందా? ఈ భూమి అనేది లేకపోతే ఇన్ని లక్షల కోట్ల జీవరాసులు ఉద్భవిస్తాయా? నీ సైన్సూ, నీ మాట, యీ మనుజ జాతీ పుట్టకముందు నించే యీ సృష్టి ఉంది. నాయనా E=Mc 2 అనే థియరీ ఆఫ్ రెలెటివిటీని సామాన్యుడి చేతికిస్తే అర్ధమవుతుందా? అదే సిద్దాంతం ఓ సైంటిస్ట్ చేతిలో పడి అణుబాంబులుగా మారి హిరోషిమా నాగసాకీని సర్వనాశనం చెయ్యలేదా? ఇనుముతో సహా రాయినీ తయారు చెయ్యొచ్చు, మేకుల్నీ, గుండు సూదుల్నీ తయారు చెయ్యొచ్చు, పిస్టళ్లనీ తయారు చెయ్యొచ్చు. అలాగే పూజలు, వ్రతాలు,

ఉపవాసాలూ, యజ్ఞాలు ఇవన్నీ నిర్దేశింపబడింది భౌతిక విషయ నిరూపణకి కాదు. అంతెందుకూ బాధ కంటికి కనబడుతుందా? బాధ కనపడదు – కన్నీరు కనబడుతుంది. సంతోషం తనుగా వ్యక్తమవదు. నీ భావాలతోనూ, నవ్వులతోనూ వ్యక్తమవుతుంది. అలాగే శక్తీ వ్యక్తమవుతుంది. ఆ సాధన చేసిన వారికి మాత్రమే.

ఓ అర్జెంటు ఆపరేషన్ చెయ్యాల్సినప్పుడు ఓ నిపుణుడైన డాక్టర్ బ్లేడ్‌తో కూడా చేసిన సందర్భాలు చాలా ఉన్నై. అదే నువ్వూ నేనూ చెయ్యగలమా? ఆసక్తితో అడిగిన వారికి సమాధానమివ్వు. ఆకతాయిగానో, ఆటపట్టించడానికో అడిగినవారిని పట్టించుకోకు" నవ్వుతూ సమాధానం చెప్పి లేచింది జటావల్లభి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments